సాక్షి చిత్తూరు

బుధవారం । 26 । మార్చి । 2025



స్వీయ ధ్రువీకరణతో భవన అనుమతులు

కొత్తగా భవనాలు నిర్మించుకునే ప్రజలు స్వీయ ధ్రువీకరణ ఇచ్చి అనుమతు లు తీసుకోవచ్చని ఆర్డీ తెలిపారు. - IIలో



ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

చిత్తూరు జిల్లాలో ఖాళీ అయిన స్థానిక సంస్థలకు ఈనెల 27న ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు జేసీ తెలిపారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
చిత్తూరు	6-29	4-52
పుంగనూరు	6-31	4-57

న్యూస్‌రీల్

డీటీలకు పోస్టింగ్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో ఇటీవల ఆర్ఐ కేడర్ నుంచి డిప్యూటీ తహసీల్దార్‌గా పలువురికి ఉద్యోగోన్నతి లభించింది. వారందరికీ పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు కలెక్టర్ సీసీగా పనిచేస్తున్న యుగేష్‌కు (పెద్దపంజాణి డిప్యూటీ తహసీల్దార్), కలెక్టరేట్ లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌కు (ఇనామ్ డిప్యూటీ తహసీల్దార్, కలెక్టరేట్), డీఎస్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న మోహన్‌కు (ఎన్నికల డీటీ, పుంగనూరు), పలమనేరులో పనిచేస్తున్న నందినిదేవికి (డిప్యూటీ తహసీల్దార్, చౌడేపల్లి), కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రేఖకు (సీఎస్‌డీటీ, కుప్పం), కలెక్టరేట్‌లో పనిచేస్తున్న జోసఫ్‌కు (ఈడీటీ, కుప్పం), డీఎస్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న శిరీషాకు (సీఎస్‌డీటీ, పలమనేరు), గంగవరంలో పనిచేస్తున్న నరేంద్రకు (రీసర్వే డీటీ, కుప్పం), కలెక్టరేట్‌లో పనిచేస్తున్న శోభకు (రీ సర్వే డీటీ, వి.కోట), బంగారుపాళ్యంలో పనిచేస్తున్న మధుసూదన్‌కు (డిప్యూటీ తహసీల్దార్, సోమల)లో పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టింగ్‌లు పొందిన డీటీలు వెంటనే నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం మంజూరు



డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేస్తూ ఆన్‌లైన్‌లో పేర్కొన్న ప్రభుత్వం

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం సొంత జిల్లాలో డీఎస్సీ కేంద్రం మంజూరు చేయలేదనే అంశంపై ఈనెల 14 వ తేదీన సాక్షిలో 'భవితవ్యం..అయోమయం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లా కేంద్రంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ పొందేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మిట్టూరులో ఉన్న కుట్టి స్టడీ సర్కిల్‌ను ఉచిత శిక్షణ కేంద్రంగా ప్రకటిస్తూ ఆన్‌లైన్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, స్వర్ణమ్మ దంపతులు

సుగుటూరు.. జన హోరు



అమ్మవారి ఊరేగింపులో భక్తజన సందోహం.. (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

పుంగనూరులోని శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. జమీందారుల కులదైవమైన గంగమ్మకు ప్యాలెస్‌లో పూజలు చేసి అట్టహాసంగా మంగళవారం వేడుకలు ప్రారంభించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణమ్మ కలసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా అమ్మవారిని పల్లకీలో పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. జాతరకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో పుర వీధులు కిక్కిరిశాయి. అమ్మవారికి నెయ్యి దీపాలు, పెరుగన్నం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. – పుంగనూరు

ఈకేవైఛీ!



చిత్తూరు నగరం గిరింపేటలోని ఓ ఆధార్ సెంటర్ వద్ద లబ్ధిదారుల నిరీక్షణ



రేషన్‌లో కోత పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సాకులు వెదుకుతోంది. ఈకేవైసీ చేయించుకోకపోతే ఏప్రిల్ మాసం నుంచి బియ్యం ఆగిపోనున్నాయి. ఈ సేవల కోసం కూలి పనులు వదులుకొని రోజంతా డీలర్ల వద్ద పడిగాపులు కాస్తున్నా నమోదు పూర్తి కావడం లేదు. మరోవైపు 5 ఏళ్లు దాటిన పిల్లలకు ఈకేవైసీ కావడం లేదు. వారికి ఆధార్ అప్‌డేట్ చేయించి ఈకేవైసీ చేయించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పనుల కోసం చంటి బిడ్డలను వెంటబెట్టుకొని మండుటెండలో వీధుల వెంట తిప్పుతూ కేంద్రాల వద్ద ఎండలో పడిగాపులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈకేవైసీ సేవలు ఇంటి వద్దే గడప దాటకుండా అందేవని తలుచుకొని మహిళలు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఈ సేవలకు ఆధార్ కేంద్రాల్లో ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేయడంపై లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- రేషన్‌కార్డుదారుల పడిగాపులు
- ఈకేవైసీ పేరుతో రేషన్‌కు కోతలు
- ప్రధానంగా 'బాల ఆధార్' కు కష్టాలు
- డీలర్లను చుట్టుముడుతున్న లబ్ధిదారులు
- ఆధార్ కేంద్రాల్లో అదనపు వసూళ్లు
- ఈనెల 31న తుది గడువు
- గతంలో ఇంటి వద్దే ఈకేవైసీ సేవలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : కూటమి ప్రభుత్వం ఈకేవైసీ నమోదు పేరుతో వేధిస్తోంది. ఈకేవైసీ చేయించుకోకుంటే రేషన్‌లో కోత పెడతానంటోంది. పారదర్శకత పేరుతో కార్డుదారులపై కత్తి పెడుతోంది. నమోదుకు ఈనెల 31న గడువు విధించింది. దీంతో రేషన్ కార్డుదారులతో పాటు ప్రధానంగా బాల ఆధార్ ఉన్న కుటుంబీకులకు ఆధార్ కష్టాలు వచ్చి పడ్డాయి. పిల్లల ఆధార్ అప్‌డేట్ కోసం ఆధార్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదనుగా ఆధార్ కేంద్రాలు ఇష్టారాజ్యంగా డబ్బులు దండుకుంటున్నాయి. ఈకేవైసీ ఎక్కడైనా చేయించుకోవచ్చని అధికారులు చెబుతున్నా ఎక్కడా చేసే వారే లేరు.. కేవలం డీలర్ల వద్ద మాత్రమే చేస్తున్నారు. సచివాలయాలకు వెళితే డీలర్ల వద్దకు పంపిస్తున్నారు. డీలర్ల వద్దకు రోజు వారీ కూలీ పనులు పోగొట్టుకొని డీలర్లు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా నమోదు పూర్తి కాక అపసోపాలు పడుతున్నారు.

అనర్హులకు అందుతున్నాయనే అనుమానం

జిల్లాలో 1390 చౌక దుకాణాల కింద 5.40 లక్షల రేషన్ కార్డుదారులున్నారు. ఈ కార్డుల కింద 18,47,411 మంది ఉన్నారు. పారదర్శకత పేరుతో జాతీయ సమాచార సంస్థ ఆధ్వర్యంలో స్టాఫ్‌వేర్‌ను నవీకరిస్తున్నారు. ఇప్పటి వరకు రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ లేకున్నా సరుకులు ఇచ్చేవారు. ఇకపై అలా కుదరదని, నమోదు చేసుకోని వారికి రేషన్ కోత పడుతుందని అధికారులు చెబుతున్నారు. మృతులు, పలువురు ఉద్యోగులకు రేషన్ అందుతోందనే అనుమానంతో రేషన్ పంపిణీలో భారాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఈకేవైసీని తప్పనిసరి చేసింది. తద్వారా ఈనెల 19 నుంచి అన్ని డీలర్ షాప్‌ల్లో ఈకేవైసీ ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత 23వ తేదీ వరకు గడువు విధించింది. తర్వాత ఈనెలాఖరు వరకు గడువు పొడిగించింది.

అవసరానికో రేటు..

రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలనే నిబంధన పెట్టింది. ఇప్పటి వరకు 16,70,470 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. ఇంకా 1,76,941 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. అందుబాటులో ఉన్న లబ్ధిదారులు పనులు వదులుకొని ఈకేవైసీ కోసం క్యూ కడుతున్నారు. రేషన్ కోత పడుతోందనే భయంతో డీలర్లను చుట్టుముట్టేస్తున్నారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్న వ్యక్తులు పరుగున వచ్చి వేలిముద్రలు పెడుతున్నారు. అయితే ఇప్పుడు ప్రధానంగా బాల ఆధార్ అంటే 5 ఏళ్లు దాటిన పిల్లలకు ఈకేవైసీ కష్టాలు వచ్చి పడ్డాయి. 5 ఏళ్లు దాటి వేలిముద్ర అప్‌డేట్ చేయించుకోని పిల్లలకు ఇప్పుడు ఈకేవైసీ వేధిస్తోంది. దీంతో ఆ పిల్లల తల్లిదండ్రులు ఆధార్ సెంటర్ల వద్ద క్యూ కడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. కొందరు అన్ని చోట్ల రద్దీగా ఉండడంతో ఆధార్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఒక వేళ ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నా ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు రెండు నుంచి నాలుగు రోజుల సమయం తీసుకుంటోంది. ఇంతలో గడువు తీరితే పరిస్థితి ఏంటని పలువురు వాపోతున్నారు. తక్కువ సమయం ఇచ్చి అప్పటికప్పుడే ఈకేవైసీ చేయించుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఇదే అదునుగా భావించి పలు ఆధార్ సెంటర్లు అదనపు వసూళ్లకు దిగాయి. కొన్ని చోట్ల అప్లికేషన్ ఛార్జ్ పేరుతో రూ. 60 నుంచి రూ. 100 వరకు వసూళ్లు చేస్తోంది. ఆధార్ అప్‌డేట్ కోసం రూ. 100 నుంచి రూ. 200 వరకు ఫీజు వసూళ్లు చేస్తున్నారు. చకచక కావాళ్లంటే రూ. 500 వరకు డిమాండ్ ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలోని మొత్తం చౌక దుకాణాలు	1,390
కార్డుదారులు	5.40 లక్షలు
కార్డులోని సభ్యులు	18,47,411 మంది
ఈకేవైసీ చేయించుకున్నవారు	16,70,740
చేయించుకోని లబ్ధిదారులు	1,76,941

గతంలో ఇంటికే వచ్చేవారు..

ఈకేవైసీ, ఇతర ప్రక్రియలకు గతంలో ఇంటి వద్దకే వచ్చేవారని, ఇప్పుడు అక్కడికి..ఇక్కడికి తాము పరుగులు పెట్టాల్సి వస్తోందని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నంత వరకు వలంటీర్లు తలుపు తట్టి సేవలు అందించారంటున్నారు. రేషన్, పింఛన్, వైద్యసేవలు, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత ఇతర సేవలకు ఇంటి గడప దాటి వెళ్లే వారు కారని, సాయంత్రం, ఉదయం వేళ్లలో ఈ పనులు ముగించుకుని.. తమ పనులు చూసుకుంటుండేవారని ప్రజలు చెబుతున్నారు. ఇప్పుడు ప్రతి దానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పడం లేదని వాపోతున్నారు. బయట ఉండి రాలేని పరిస్థితుల్లో ఉంటే వలంటీర్లు అక్కడికే వెళ్లి సేవలు అందించారంటున్నారు. ఇప్పుడు పరిస్థితి ప్రతి పనికి తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.

ప్రతి ఒక్కరూ చేయించుకోవాల్సిందే..

కార్డులోని ప్రతి సభ్యుడు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఇది ఏ డీలర్ ద్వారా అయినా చేసుకోవచ్చు. ఇప్పటి వరకు 16,70,740 మంది ఈకేవైసీ చేయించుకున్నారు. మిగిలిన వారందరూ త్వరితగతిన చేయించుకోవాలి. 5 ఏళ్లలోపు ఉన్న వారికి ఈకేవైసీ అవసరం లేదు. 5 ఏళ్లు దాటిన వారు చేయించుకోవాలి. దీనిపై ఎలాంటి అనుమానాలు వద్దు.

– శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

- ఐరాల మండలంలో ఇటీవల ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. మండల అధికారులు ఎంపీపీ మోహన్‌ను సంఘటన స్థలానికి రప్పించారు. అత్యవసరంగా పనులు చేయాలని హడావుడిగా ఆయన వద్ద అనుమతి కోసం సంతకాలు తీసుకున్నారు. తీరా రహస్యంగా విద్యుత్ పనులతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు ఆయన ఆమోదం తెలిపినట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎందుకు ఇలా చేశారని ప్రశ్నిస్తే ఎలాంటి సమాధానం చెప్పకుండా దాటవేశారు.
- నగరిలో ఎంపీపీ భార్గవి అనుమతి లేకుండా ఎంపీడీఓ కార్యాలయంలో పలు పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఆ ఎంపీపీ అక్రమ పనులపై ప్రశ్నించగా ప్రస్తుతానికి పనులను ఆపివేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మండల అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పి తప్పించుకుంటున్నారు.

ఎంపీపీలపై ధిక్కారం

సమస్యలు ఆ ఇద్దరి ఎంపీపీలవే కాదు.. దాదాపు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని మండలాల్లో అదే పరిస్థితి నెలకొంది. న్యాయం చేయాల్సిన మండల అధికారులు కూటమి నేతలతో కుమ్మక్కై ఎంపీపీ, ఎంపీటీసీలకు కనీస విలువలు ఇవ్వడం లేదు. వీటిపై నిలదీస్తే కూటమి ఎమ్మెల్యేలు చెప్పిందే చేస్తున్నట్లు ఎంపీడీఓలు వెల్లడిస్తున్నారని ఎంపీపీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కూటమి ప్రభుత్వంలో హక్కులు నిర్వీర్యం
- ఎటువంటి సమాచారం ఇవ్వని వైనం
- ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు
- పలు మండలాల ఎంపీడీఓలు నియంతలుగా వ్యవహారం
- పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ దృష్టికి ఎంపీపీల సమస్యలు



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప, ఎంపీపీలు

చిత్తూరు కలెక్టరేట్ /చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఎంపీపీ (మండల ప్రజా పరిషత్ ప్రెసిడెంట్)కు పది నెలలుగా తగిన గౌరవం దక్కడం లేదు. మండల అభివృద్ధిలో ఎంపీపీల పాత్ర ఎంతో కీలకం. అలాంటి ఎంపీపీలకు టీడీపీ కూటమి ప్రభుత్వం కనీస మర్యాద ఇవ్వడం లేదు. స్థానిక సంస్థల్లో కీలకంగా వ్యవహరించే ఎంపీపీల నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ఇదేమిటని అడిగితే అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారు...బెదిరిస్తున్నారు. ఆయా మండలాల్లో ఎంపీపీల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులను జరగనివ్వకుండా అడ్డుకుంటున్నారు. పది నెలలుగా ఇదే తంతు జరుగుతోందని ఎంపీపీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ అభివృద్ధి పనుల వివరాలు అడిగినా ఎంపీడీఓలు కూటమి ఎమ్మెల్యేలను అడిగి తెలుసుకోవాలని, ఎమ్మెల్యే అనుమతి ఉంటేనే వివరాలు వెల్లడిస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీలు.. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడును కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆటంకాలు సృష్టిస్తున్న 'కూటమి'

ఎంపీపీల హక్కులు, గౌరవానికి, అధికారాలను కూటమి టీడీపీ ప్రభుత్వం ఆటంకాలు సృష్టిస్తోందని ఎంపీపీల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ హనుమంతరావు ఆరోపించారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పతో కలిసి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పది నెలలుగా క్షేత్ర స్థాయిలోని మండలాల్లో ఎంపీపీలకు జరుగుతున్న అన్యాయాలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను సుదీర్ఘంగా జెడ్పీ సీఈఓతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ, నాయకులు మోహన్, అమరావతి, సురేష్, భార్గవి, సురేంద్రరెడ్డి, యశ్వంత్, జయరాం, శివారెడ్డి, డి.సురేష్, త్యాగ, సంపత్, రాజశేఖర్, మునిలక్ష్మి, గుణశేఖర్‌రెడ్డి, తులసి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో కక్ష సాధింపులు

కూటమి టీడీపీ పాలనలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం దక్కడం లేదని ఆంధ్రప్రదేశ్ ఎంపీపీల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారిక సమావేశాల్లో చెబుతున్న మాటలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలపై కక్ష సాధింపులకు పాల్పడుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంపీపీల అధికారాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

ప్రతి పనికి ఎమ్మెల్యే అనుమతులు..

గ్రామాల్లో ఏ చిన్న పని చేయాలన్నా కూటమి టీడీపీ ఎమ్మెల్యే అనుమతి కావాలని ఎంపీడీఓలు చెబుతున్నారన్నారు. ఇలాంటి ధోరణి గతంలో ఎన్నడూ లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల ఎంపీడీఓలు నియంతల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంపీపీలకు సంబంధించి అభివృద్ధి పనుల వివరాలు, చేపడుతున్న పనుల వివరాలు, సమావేశాలకు ముందస్తు సమాచారం ఇవ్వడం లేదన్నారు. మరికొందరు ఎంపీడీఓలైతే ఏకంగా పర్సంటేజీలు అడుగుతున్నట్లు తెలిపారు. గతంలో చేసిన పనులకు బిల్లులు ఆమోదించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రామాల్లో చిన్న పనులు చేయాలన్నా ఎంపీడీఓలు ఇబ్బందులు పెడుతున్నారని జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- ప్రభుత్వ అధికారులు ఎంపీపీల విషయంలో ప్రొటోకాల్ పాటించాలి
- ఎంపీపీల నిధుల విషయంలో పాలకవర్గం అనుమతి లేకుండా ఎంపీడీఓలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారి పోకడలను నియంత్రించాలి
- ఎంపీపీ, పాలకవర్గం తీర్మానించిన అభివృద్ధి పనులు అమలు చేయకుండా , ప్రొసీడింగ్స్, వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా దురుద్దేశంతో కాలయాపన చేస్తున్నారు.
- కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా ఎంపీపీ నిధుల్లో చేపట్టే పనులకు పంచాయతీ తీర్మానం కావాలని అధికారులు చట్ట వ్యతిరేకంగా నడుచుకుంటున్నారు.
- ఎంపీపీలకు వాహన అలవెన్సు, గౌరవ వేతనం ఇవ్వడం లేదు.

న్యాయపరంగా పోరాడుతాం



ఎంపీడీఓలు ఎమ్మెల్యేల పేరుతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. తీర్మానించిన పనులు చేయకుండా నేతలు చెప్పిన పనులు చే స్తున్నారు.న్యాయపరంగా పోరాటం చేస్తాం. – హనుమంతరావు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఎంపీపీల సంక్షేమ సంఘం

అధికారులు వేధిస్తున్నారు



మండలంలో తీర్మానించిన పనులను చేసుకోవాలంటే జిల్లాలో కష్టంగా మారింది. అధికారులు నియంతలా వ్యవహరిస్తున్నారు. వీటిపై అన్ని సమావేశాల్లో తెలియజేసినా మార్పు రావడం లేదు. – రెడ్డెప్ప, జిల్లా అధ్యక్షుడు ఎంపీపీల సంఘం

సగం–సగం అంటున్నారు



మండలంలో మా నిధులతో జరిగే పనులను కూటమి నాయకులకు సగం కేటాయించాలని అధికారులు చెప్పడం బాధాకరం. అభివృద్ధి పనులను నా అమనుతి లేకుండా చేపట్టారు. వీటిని ప్రశ్నిస్తే ప్రస్తుతానికి ఆపారు. – భార్గవి, ఎంపీపీ నగరి

పంచాంగం ఆవిష్కరణ



పంచాంగం ఆవిష్కరిస్తున్న అధికారులు, వేదపండితులు

కాణిపాకం : కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని కల్యాణ వేదికలో మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాగాన్ని ఆవిష్కరించారు. ఈకా పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమానికి తిరుపతికి చెందిన కుప్పా విశ్వనాథ శాస్త్రి, హైదరాబాద్‌కు చెందిన మార్తి వెంకట రామశర్మ పాల్గొన్నారు. పంచాంగ విశిష్టతపై ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ పెంచల కిషోర్, దేవస్థాన ఆస్థాన పంచాంగ కర్త, పంచాంగ రూపకర్త అత్తూలి శివకుమార్ శర్మ, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్‌వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, సూపరింటెండెంట్‌లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై 50 శాతమే వడ్డీ మాఫీ

చిత్తూరు అర్బన్ : మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై వడ్డీని 50 శాతమే మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈనెలాఖరు వరకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో ఆరు రోజుల గడువు మాత్రమే ఉంది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఆస్తి పన్నుపై పూర్తిగా వడ్డీ మాఫీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చేవి.కానీ ఈసారి కూటమి ప్రభుత్వం కొత్తగా 50 శాతం వడ్డీని తెరపైకి తీసుకొచ్చింది. 50 శాతం వడ్డీ మాఫీ చేయడం ఏంటని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ ఏనుగుల గుంపు.. పొలాలు ధ్వంసం

గుడిపాల : మళ్లీ ఏనుగుల గుంపు గుడిపాలకు వచ్చింది. మంగళవారం తెల్లవారుజామున మూడు ఏనుగులు పల్లూరు గ్రామ సమీపంలోని పంట పొలాల వద్దకు చేరాయని, ఇవి తమిళనాడు నుంచి గుడిపాలకు వచ్చాయని రైతులు తెలిపారు. ఉదయం 5:30 గంటల ప్రాంతంలో వరి, అరటి పంటలను ధ్వంసం చేశాయని రైతులు వాపోయారు. దూరం నుంచి కేకలు వేయడంతో అటవీ ప్రాంతంలోకి వెళ్లి పోయాయని రైతు లు తెలిపారు. పంట కోతకు వచ్చే సమయంలో ఏనుగుల గుంపు వచ్చి పంటలు నాశనం చేశాయని రైతులు లబోదిబోమంటున్నారు.



ధ్వంసమైన వరి పంట

క్లుప్తంగా

నేడు ఫ్యాప్టో కార్యవర్గ ఎన్నికలు

చిత్తూరు కలెక్టరేట్ : ఫ్యాప్టో (ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ మునాఫ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం ఎన్నికలు సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఫ్యాప్టో సభ్య సంఘాలు ఎన్నికలకు హాజరు కావాలని కోరారు. ఎన్నికల పరిశీలకులుగా స్కూల్ అసిస్టెంట్ సంఘం రాష్ట్ర నాయకులు నరోత్తమరెడ్డి వ్యవహరిస్తారని వెల్లడించారు.

అర్హులైన ముస్లింలకు సంక్షేమ పథకాలు

- ఇఫ్తార్ విందులో జాయింట్ కలెక్టర్



ఇఫ్తార్‌లో జేసీ విద్యాధరి, ఎమ్మెల్యే, తదితరులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన ముస్లింలకు సంక్షేమ పథకాలు అందిస్తామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఉర్దూ షాదీ మహల్‌లో అధికారికంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత గురువులు, ముస్లిం సోదరుల నడుమ ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి, మైనారిటీ సంస్థ ఈడీ హరినాథ్‌రెడ్డి, ముస్లిం లు పాల్గొన్నారు.

బాలికలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కస్తూర్బా గాంధీ విద్యాలయాలను (కేజీబీవీ) నెలకొల్పింది. చిత్తూరు జిల్లాలోని కేజీబీవీలను సమగ్రశిక్ష అభియాన్ పర్యవేక్షిస్తోంది. ఈ పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పాఠశాలల్లో ప్రవేశాలు పొందడం పేద విద్యార్థినులకు వరం లాంటిదని విద్యావేత్తలు చెబుతున్నారు.



కేజీబీవీలు.. బాలికలకు వరం

- ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కోర్సులు
- కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలు, అనాథ బాలికల చదువుకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు) బాసటగా నిలుస్తున్నాయి. ఉచిత వసతితో పాటు భోజనంతో కూడిన విద్యను అందిస్తున్నాయి. తాజాగా కేజీబీవీల్లో 6వ తరగతితో పాటు ఇంటర్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ 11వ తేదీ గడువు విధించారు. అర్హులైన బాలికలు 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందవచ్చు.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా కుప్పం, రామకుప్పం, గుడుపల్లి, శాంతిపురం, బైరెడ్డిపల్లి, గంగవరం, పుంగనూరు, రొంపిచెర్లలలో కేజీబీవీలు ఉన్నాయి. సీట్ల భర్తీలో నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీ వారీగా ప్రాధాన్యం ఇస్తారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం సీట్లను భర్తీ చేస్తారు. 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్లకు అడ్మిషన్లు ఉంటాయి. ఒక్కో తరగతికి 40 సీట్ల చొప్పున కేటాయించారు. దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది.

ప్రత్యేకత ఇదీ....

ఈ విద్యాలయాల్లో చేరిన బాలికలకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫారం అందిస్తారు. మెరుగైన వైద్య సదుపాయం, వృత్తి విద్యలో శిక్షణ అందిస్తారు. చదువుతోపాటు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, నృత్యం, సంగీతం వంటివాటిని నేర్పిస్తారు. తరగతి గదుల్లో ఎల్‌సీడీ ప్రాజెక్టర్లు, డీవీడీ ప్లేయర్ల ద్వారా బోధన ఉంటుంది. ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

నిరంతర పర్యవేక్షణ



కేజీబీవీ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యా బోధన సాగుతుంది. మౌలి కసదుపాయాలు, విద్యార్థులకు స్మార్ట్ డిజిటల్ తరగతులు ద్వారా బోధన ఉంటుంది. బాలికలకు భరోసాగా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. **– వెంకటరమణ, జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్, చిత్తూరు**

పురోగతికి సోపానం



జిల్లాలోని కేజీబీవీలు పేద విద్యార్థినుల పురోగతికి సోపానాలు, కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. విద్యార్థినులు అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం ఇచ్చారు.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఈనెల 27వ తేదీన నిర్వహించే మండల ప్రజాపరిషత్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీ అయిన స్థానాలకు ఈనెల 27వ తేదీన మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యుల ఎంపికకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రామకుప్పం (మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు), తవణంపల్లి (మండల పరిషత్ అధ్యక్షుడు), విజయపురం (ఉపాధ్యక్షుడు), సదుం (మండల పరిషత్ అధ్యక్షుడు), తిరుపతి (మండల పరిషత్ అధ్యక్షుడు), పెనుమూరు, పీలేరు (కో ఆప్షన్ సభ్యుల) స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికలకు ఎంపీడీఓలు పీవో లుగా వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల పర్యవేక్షణకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా సభ్యులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహించే కేంద్రాల్లో మౌలిక వసతులు పరిశీలించాలన్నారు. ఎన్నికకు సంబంధించి కోరం తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అనంతరం ఎన్నికైన అభ్యర్థుల వివరాలను నోటీస్ బోర్డులో నమోదు చేయాలన్నారు. సభ్యులు తగినంత మంది హాజరుకాకపోతే ఈనెల 28వ తేదీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ మోహన్‌కుమార్, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, తదితర అధికారులు పాల్గొన్నారు.

స్వీయ ధ్రువీకరణతో భవన నిర్మాణ అనుమతులు

చిత్తూరు అర్బన్ : కొత్తగా భవనాలు నిర్మించుకునే ప్రజలు సెల్ఫ్ డిక్లరేషన్ (స్వీయ ధ్రువీకరణ) ఇచ్చి, అనుమతులు తీసుకోవచ్చని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అనంతపురం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్డీ) విజయ భాస్కర్ స్పష్టం చేశారు. మంగళవారం చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు, తిరుపతి జిల్లాకు చెందిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఏసీపీ నాగేంద్రతో కలిసి ఇంజినీర్లు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీ మాట్లాడుతూ.. 18 మీటర్లు / అయిదంతస్తుల లోపు భవనాలను నిర్మిస్తే స్వీయ ధ్రువీకరణ ఇస్తే చాలన్నారు. అయితే భవన యజమానులు వీటిని రిజిస్టర్ ఎల్టీపీలు, ఇంజినీర్లు, ఆర్కెటెక్ట్‌ల సమక్షంలో సరైన పత్రాలతో అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు సులువుగా భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడానికి నూతనంగా తీసుకొచ్చిన ప్రభుత్వ ఆదేశాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రజలు దీనిపై ఏదైనా అనుమానాలుంటే ఆయా మున్సిపాలిటీల్లోని టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి టౌన్ ప్లానింగ్ అధికారి సుభద్రపదతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన టౌన్ ప్లానింగ్ అధికారులు

బడి పిల్లల మోతకు విరామం

- ఇప్పటి దాకా నెలలో మూడో శనివారం మాత్రమే
- ఇకపై ప్రతి శనివారం నో స్కూల్ బ్యాగ్ అమలు
- పిల్లలచే సృజనాత్మకను పెంపొందించే కార్యక్రమాలు
- మంచి నిర్ణయం అంటున్న మేధావులు, తల్లిదండ్రులు



జిల్లా ప్రభుత్వ బడుల సమాచారం

బడులకేటగిరి	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ప్రైమరీ	1902	64,519
అప్పర్ ప్రైమరీ	204	45,800
హైస్కూల్స్	330	30,898
మొత్తం	2,436	1,41,217

పలమనేరు : ఏం చదువులోగానీ చిన్నారులకు మాత్రం బండెడు పుస్తకాల మోత తప్పడం లేదు. ఆడుతూ.. పాడుతూ ఉండాల్సిన వయస్సులో పిల్లలకు బ్యాగుల భారం శరాఘాతంలా మారిందని తల్లిదండ్రులు ఎన్నాళ్లుగానో ఆవేదన చెందుతున్నారు. జాతీయ విద్యా విధానం అమలై నాలుగేళ్లైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇకపై ప్రతి శనివారం 'నో బ్యాగ్‌డే'ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనుంది. నో బ్యాగ్ డేన పిల్లలకు క్విజ్ పోటీలు, డిబేట్లు, క్రీడలు, క్షేత్రస్థాయి పర్యటనలు తదితర సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

పుస్తకాల భారం తగ్గించాలనే లక్ష్యం

చిన్నారుల బరువులో పది శాతానికి మించి బరువు మోయరాదనే నిపుణుల మాటలను ఇప్పటి దాకా అటు పాఠశాలల యాజమాన్యాలు, ఇటు తల్లిదండ్రులు అసలు పట్టించుకోలేదు. చిన్నారుల పుస్తకాల మోతపై గతంలో అధ్యయనం చేసిన యశ్‌పాల్ కమిటీ కొన్ని సూచనలు చేసింది. 1 నుంచి 5 తరగతులకు మూడు కిలోలకు మించి బరువు మోయించరాదని, పదో తరగతికి ఐదు కిలోల వరకే బరువు ఉండాలని సూచించారు.

ఇకపై సెమిస్టర్ విధానం

పిల్లల భుజాలపై పుస్తకాల భారాన్ని తగ్గించేందకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బడుల్లో సెమిష్టర్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఆ సెమిష్టర్‌కు సంబంధించిన రెండు పుస్తకాలు, నోట్స్‌లను మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొదలు కానున్నట్లు అధికారులు తెలిపారు.

ఇది మంచి నిర్ణయమే..



గతంలో యశ్‌పాల్ కమిటీ పలు సూచనలు చేసింది. కానీ ప్రభుత్వాలు అమలు చేయడంలో ఆలస్యం చేశాయి. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం నోబ్యాగ్‌డేపై రాష్ట్రాలు సైతం అమలు చేయాలని ఆదేశించడంతో ఇక్కడ అమలుకు రంగం సిద్ధం అయింది.
– సోమ చంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు, పలమనేరు

పిల్లలకు అనారోగ్య సమస్యలు తగ్గుతాయి



ఎదిగే వయస్సు పిల్లలకు వారి బరువు కంటే అధిక బరువులను మోయించడంతో ఆరోగ్య సమస్యలు తప్పవు. ఎముకలు, కీళ్లు, వెన్నుముక, కండరాల సమస్యలు రావచ్చు. అసలు 20 ఏళ్ల తర్వాత వచ్చే జబ్బులన్నీ పాఠశాల దశలోనే వస్తున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వాలు నో బ్యాగ్‌డేను ప్రతి శనివారం అమలు చేయడంతో భవిష్యత్తులో పిల్లల ఆరోగ్యానికి పెద్దపీట వేసినట్టే.
– డా.మమతారాణి, సూపరింటెండెంట్, ఏరియాఆస్పత్రి, పలమనేరు

దైవభాష అభ్యసనం మహాదృష్టం

తిరుపతి సిటీ: సంస్కృత భాషకు నిలయమైన ఎన్ఎస్‌యూలో దైవభాషను అభ్యసిస్తున్న, అధ్యయనం చేస్తున్న విద్యార్థులు అదృష్టవంతులని బెంగళూరు డీఆర్‌డీఓ ప్రముఖ శాస్త్రవేత్త ఎల్ఎన్ రాఘవేంద్ర కొనియాడారు. జాతీయ సంస్కృత వర్సిటీలో మంగళవారం వర్సిటీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. సంస్కృతంలో నిక్షిప్తమైన భారతీయ సంస్కృతి ఆధునిక సమాజానికి మార్గదర్శిగా ఉందన్నారు. సంస్కృత భాష ఔన్నత్యం విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత విద్యార్థులు, అధ్యాపకులపై ఉందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత అధ్యయన, అధ్యాపన విషయంలో ఉత్తమ జ్ఞానాన్ని విద్యార్థులకు, ప్రజలకు అందిస్తూ భారతీయ సంస్కృతిని, సంస్కృత భాషను సంరక్షిస్తూ ప్రాచీన భాషతో పాటు ఆధునిక సాంకేతిక విషయాలను వర్సిటీ విద్యార్థులకు నేర్పిస్తూ ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. అనంతరం పలు క్రీడా, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, కే వెంకటనారాయణ రావు, డీన్లు సి దక్షిణమూర్తి శర్మ, సి రంగనాథన్, రజనీకాంత్ శుక్లా, అధ్యాపకులు నాగరాజు, ఉదయనా హెగ్డే, లీ నాచంద్ర, సేతురాం, వైష్ణవి, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుడిపై వేధింపులు

- వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేత
- కూటమి నేతల కక్ష సాధింపు

విజయపురం : బతుకు దెరువు కోసం మినరల్ వాటర్ ప్లాంట్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్న జిల్లు అనే దళితుడి షాపుకు కరెంట్ కట్ చేయించి కూటమి నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అతను పని చేయడమే వేధింపులకు ప్రధాన కారణమైంది. స్థానిక ఎమ్మెల్యేతో పాటు మండల నాయకులు కక్ష కట్టి వేధిస్తున్నారని బాధితుడు జిల్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపల్లి దళితవాడకు చెందిన జిల్లు నాలుగేళ్ల కిందట పన్నూరు సబ్‌స్టేషన్‌లో స్థలం లీజుకు తీసుకొని రూ.12 లక్షలు అప్పు చేసి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొన్నాడు. దీనికి అన్ని రకాల అనుమతి పొందారు. వైఎస్ జగన్, రోజాపై ఉన్న అభిమానంతో 2024లో ఆ పార్టీకి మద్దతు పలికాడు. దీంతో కూటమి నేతల ఆగ్రహానికి లోనయ్యాడు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలుగా మండల స్థాయి టీడీపీ నాయకులు వివిధ రకాలుగా తనను వేధించడం ప్రారంభించారని బాధితుడు వాపోయాడు. చివరికి విద్యుత్ శాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి మంగళవారం మినరల్ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కక్ష సాధింపుతోనే షాపునకు కరెంట్ కట్ చేయించారని బాధితుడు జిల్లు వాపోయాడు.



మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద బాధితుడు జిల్లు

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల విజయకేతనం



నవోదయలో ప్రవేశాలకు అర్హత సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాసంస్థల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు విక్రమ్, గోపిక, జీవన్‌సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్ యాదవ్, జాహ్నవి, జస్వంత్, మిథున్ మిహాల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయతోపాటు మొత్తం 37 మంది నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. 35 ఏళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్ తదితర ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందడం తమకు గర్వకారణమని తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎస్. తులసీ విశ్వనాథ్ అభినందించారు.

విలువల విద్య అవసరం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు చిన్నప్పటి నుంచే విలువలతో కూడిన విద్య ముఖ్యమని ఇండియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సెల్వరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంతపేటలో ఉన్న బృందావన్ సీబీఎస్ఈ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. చిత్తూరు పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి మాట్లాడుతూ.. విద్యార్థులకు చట్టాల ప్రాధాన్యం తెలియజేయాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శైలజా కుమారి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు క్రీడల్లో, విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ విజయభాస్కరరావ్, డైరెక్టర్ ప్రియతేజ, ఇండియన్ బ్యాంక్ బీఎం మురళీకృష్ణ, విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

వాస్తవాలు వెలుగులోకి తెస్తే కేసులా ?



ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

వెదురుకుప్పం : గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో జరుగుతున్న మట్టి, ఇసుక దోపిడీపై వాస్తవాలు వెలుగులోకి తెచ్చిన 'సాక్షి' విలేకరిపై కేసులు నమోదు చేయాలంటూ జనసేన నాయకులు ఫిర్యాదు చేయడం చూస్తే గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్న చందంగా వ్యవహారం ఉంది. సోమవారం 'దమ్ముంటే పట్టుకో' అంటూ జిల్లాలో జరుగుతున్న ఇసుక, గ్రావెల్ దోపిడీపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. అయితే ఈ కథనం జనసేన నాయకుల గుండెల్లో గుబులు రేపినట్లు ఉంది. మంగళవారం వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్యకు 'సాక్షి' విలేకరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. వాస్తవాలు వెలుగులోకి తెస్తే కేసులు నమోదు చేయాలంటూ పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేస్తున్నారో అర్థం కావడం లేదంటూ పలువురు విమర్శిస్తున్నారు. ఎవరినీ ఉద్దేశించి గానీ ఎవరి పేరు పెట్టి కానీ వార్తలు రాయకనే కేవలం జనసేనకు చెందిన నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, యువ నాయకులు చందు, మండల ప్రధాన కార్యదర్శి ముని, కార్యదర్శి పళమేశ్వర్ కలిసి ఫిర్యాదు చేశారు. అది కూడా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్న యుగంధర్ ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలపడం ప్రజలకు ఆశ్చర్యం కలిగిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు రవి

వెదురుకుప్పం : మండలంలోని చిన్నపోటుచేను సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు..కార్వేటినగరం మండలంలోని కేపీ అగ్రహారం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు రవి(26) తిరుపతిలోని ఓ పెట్రోలు బంక్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో పచ్చికాపల్లం పరిధిలోని చిన్నపోటుచేను వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో రవి తలకు బలమైన గాయం తగిలి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. గాయపడిన రవిని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శవ పరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెట్టింగ్ యాప్‌తో బురిడీ

- రాయలపేటలో బెట్టింగ్ ముఠా !
- ఓ బాధితుడి ఫిర్యాదుతో మోసాలు వెలుగులోకి..
- రెండు నెలల కిందట ఎఫ్ఐఆర్ వేసి 15 మందిపై కేసు
- వందల సంఖ్యలో బాధితులు



సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఎక్కడో పెద్ద నగరాల్లో క్రికెట్ యాప్ బెట్టింగులు చేసి మోసాలకు పాల్పడేవాళ్లను చూస్తుంటాం. కానీ పలమనేరు నియోజకవర్గంలోని పెద్ద పంజాణి మండలం రాయలపేట లాంటి గ్రామంలో ఓ సెల్‌షాప్ నిర్వహించే వ్యక్తి క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో కోట్లు సంపాదించి వందల మందిని రోడ్డున పడేస్తాడని ఎవరూ ఊహించి ఉండరు. కానీ ఇది నిజం.. బెట్టింగ్ మోసాలతో రూ.70 లక్షలు పోగొట్టుకున్న ఓ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాయలపేట బెట్టింగ్ ముఠా గుట్టు మంగళవారం వెలుగు చూసింది.

సెల్‌ఫోన్ దుకాణం నడుపుకుంటూ...

రాయలపేటకు చెందిన చంద్రబాబు (36) మొబైల్ షాపు పెట్టుకొని చిన్నపాటి రిపేర్లు చేసుకునేవాడు. క్రికెట్ బెట్టింగులపై ఆసక్తితో పలు ముఠాలతో సంబంధాలు పెట్టుకొన్నాడు. దీంతో తానే స్వయంగా రాధ.ఎక్సేంజ్ అనే ఆఫ్‌లైన్ బెట్టింగ్ యాప్ ద్వారా బెట్టింగులు కొనసాగించడం మొదలు పెట్టాడు. ఇది మొబైల్‌లో ఎవరికీ కనిపించని డార్క్‌నెట్. ఇతని మోసాలకు ఈ మూడేళ్లలో వందల మంది బలైనట్లు తెలుస్తోంది. ఇలా సంపాదించిన కోట్ల రూపాయలతో సొంత గ్రామంలో విలాసవంతమైన భవంతులు అందులో ఫేస్‌లాక్ డోర్లు, ఎటు చూసిన ఆస్తులు, బెంగళూరులో అపార్ట్‌మెంట్లు, రూ.50 లక్షల కారు ఇలా జీవితాన్ని విలాసవంతం చేసుకున్నాడు. తనతోపాటు తన కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల ఖాతాల ద్వారా సైతం భారీగా లావాదేవీలు జరిపాడు.

మోసపోయిన బాధితులు వందల సంఖ్యలో...

ఇతని ప్రైవేట్ బెట్టింగ్ యాప్ ద్వారా బెట్టింగులకు పాల్పడిన బాధితులు వందలసంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరిలో సాఫ్ట్‌వేర్‌లు, టీచర్లు, స్టూడెంట్లు, పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది.

- ఈ విషయమై గంగవరం రూరల్ సీఐ మురళీమోహన్‌ను వివరణ కోరగా రాయలపేటకు చెందిన చంద్రబాబుతో పాటు మరికొందరిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మాట నిజమేనన్నారు. ఈ కేసులో భాగంగా ప్రధాన నిందితుడిని పట్టుకునే పనిలో ఉన్నామని తెలిపారు.

బాధితుడి ఫిర్యాదుతో...

నేలపల్లికి చెందిన ఓ యువకుడు ముఠా నిర్వాహకుడు చంద్రబాబు మాట నమ్మి క్రికెట్ బెట్టింగ్‌లో రూ.70 లక్షలు పోగొట్టుకున్నానని రెండు నెలల క్రితం పెద్ద పంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇరువురు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఈ పంచాయతీ ఇక్కడి ముఖ్యనేత వద్దకు చేరినట్లు సమాచారం. అది రాజీకాకపోవడంతో మళ్లీ పోలీసులు రంగ ప్రవేశం చేసి తాజాగా చంద్రబాబుతోపాటు మరో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు ముఠా గ్రామం నుంచి పరారైంది. ఇప్పుడు పోలీసులు నిందితులను పట్టుకునే పనిలో పడ్డారు. దీంతో ఈ విషయం మంగళవారం బయటపడింది.